క్లుప్తంగా

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, సుంకరి శ్రీనివాసరావు

చీడికాడ: ఖండివరం గ్రామానికి చెందిన ఎద్దు నాగరాజు మృతితో అతడి కుటుంబానికి వైఎస్సార్ ప్రమాద బీమా తక్షణ సాయం కింద ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ రూ.10 వేలు మంగళవారం అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలు నామిని బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుంకరి శ్రీనివాసరావు, నాయకులు మోసూరి సన్నిబాబు, షేక్ సూర్యనారాయణ, డెయిరీ డైరెక్టర్ సీరంరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పేదింటి నిర్మాణానికి ఆర్థిక సాయం



అప్పారావుకు రూ.20 వేలు అందిస్తున్న దాత అచ్చింనాయుడు

కె.కోటపాడు: పేదరికంతోపాటు అంగవైకల్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న గవరపాలెం గ్రామానికి చెందిన డెక్క అప్పారావు కుటుంబానికి డేస్ ఫౌండేషన్ చైర్మన్ దొగ్గ అచ్చింనాయుడు చేయూతనందించారు. గ్రామంలో బాధితుడు ఇంటి నిర్మాణానికి రూ.20 వేలు మంగళవారం అందించారు. పేద కుటుంబాలకు సామాజిక బాధ్యతతో అండగా నిలుస్తున్న ఫౌండేషన్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెంలో రైస్‌మిల్ నుంచి యడ్లవారి కళ్లాల వరకు మట్టిరోడ్డును గ్రావెల్‌రోడ్డుగా నిర్మాణానికి విశాఖ డెయిరీ నుంచి రూ.7 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టే పనులకు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ మంగళవారం భూమిపూజ చేశారు. ఇటీవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకుడు యడ్ల వెంకటరావుతోపాటు రైతులు ఇక్కడ రోడ్డు సమస్యను వివరించడంతో ఈ నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్ పైల పైడితల్లమ్మ, యడ్ల వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి సత్యనారాయణ, పాల సంఘం అధ్యక్షుడు ఎం.దేముడుబాబు, సూపర్‌వైజర్ చక్రి పాల్గొన్నారు.

అదనపు భవన నిర్మాణానికి రూ.1.70 కోట్ల మంజూరు

- నేడు భూమి పూజ చేయనున్న డిప్యూటీ సీఎం

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి (పీహెచ్‌సీ) మహర్దశ పట్టింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో అదనపు భవన నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరయ్యాయి. ఈ అదనపు భవనాన్ని ప్రస్తుత పీహెచ్‌సీ వెనుక భాగంలో ఖాళీ స్థలంలో నిర్మించేందుకు అధికారులు చదును చేయించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం బుధవారం భూమి పూజ చేస్తారు. ప్రస్తుత భవనానికి నాడు–నేడు పథకంలో భాగంగా రూ.35 లక్షలతో ఇటీవల మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఈ భవనం రోగులకు చాలకపోవడంతో అదనపు భవనం నిర్మించనున్నారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ

మాడుగుల: ఒమ్మలిలో మంగళవారం అత్యంత వైభవంగా మోదకొండమ్మ పండగ ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, నేల వేషాలు ఆకట్టుకున్నాయి. సినిమాలు వచ్చిన తర్వాత కనుమరుగైపోతున్న సాంఘిక నాటకాలు ప్రదర్శించడంతో పులువురు ఆసక్తిగా తిలకించారు. భారీ మందుగుండు సామగ్రి కాల్చారు.

అభివృద్ధి 'బాట'

- రూ.1.18 కోట్లతో కొత్తపెంట–ఎన్.గజపతినగరం బీటీరోడ్డు నిర్మాణం
- రూ.74 లక్షలతో పూర్తయిన వంటర్లపాలెం–ముకుందపురం బీటీరోడ్డు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవపై హర్షాతిరేకాలు



శరవేగంగా కొత్తపెంట–ఎన్.జి.నగరం రోడ్డు నిర్మాణ పనులు



కొత్తపెంట–ఎన్.జి. నగరం రోడ్డులో నిర్మించిన సీసీ కల్వర్టు



పూర్తయిన వంటర్లపాలెం నుంచి ముకుందపురం తారురోడ్డు

మాడుగుల రూరల్/దేవరాపల్లి: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే, ఆ ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యం ఉండాలి. ఈ ఉద్దేశంతోనే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక దృష్టి సారించి అధ్వానంగా మారిన గతుకుల రోడ్ల రూపురేఖలు మార్చుతున్నారు. కోట్లాది రూపాయలతో పది కాలాల పాటు మన్నిక ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పుడు మాడుగుల నియోజకవర్గంలో శరవేగంగా ఈ పనులు కొనసాగుతున్నాయి.

రూ.74 లక్షలతో...

మాడుగుల మండలంలో వంటర్లపాలెం నుంచి ముకుందపురం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి వరకు నిర్మించిన రెండు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు అందుబాటులోకి వచ్చింది. ఉపాధి హామీ పథకం నిధులతో రూ.74 లక్షలతో ఈ రహదారితోపాటు, ఐదు కల్వర్టులు నిర్మించారు.

గతంలో ఇవి ఇబ్బందులు...

గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈ రోడ్డు పూర్తిగా గోతులమయంగా ఉండేది. వర్షం పడితే బురదమయమై తీవ్ర అవస్థలు పడేవారు. వంటర్లపాలెం నుంచి చోడవరం, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లి తిరిగి కె.జె.పురం మీదుగా ప్రయాణాలు సాగించేవారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో ఈ ఇబ్బందులు పూర్తిగా తొలగాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వంటర్లపాలెం, ముకుందపురం గ్రామాల పొలాలు ఈ రహదారిని ఆనుకొని ఉన్నాయి. రైతులు పంటను సునాయాసంగా తరలించడానికి వీలవుతుందని చెబుతున్నారు.

చురుగ్గా కొత్తపెంట నుంచి ఎన్.గజపతినగరం బీటీరోడ్డు..

దేవరాపల్లి మండలం కొత్తపెంట నుంచి ఎన్.గజపతినగరం వరకు 1.6 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.1.18 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మార్గంలో ఇప్పటికే సిమెంట్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మట్టి, జీఎస్‌పీ లెవిలింగ్, రోలింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే వెట్ మిక్స్ వేసి బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.

గతంలో భారీ గోతులు...

గతంలో ఈ రహదారిలో రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవించేవారు. దారి పొడవున భారీ గోతులు ఉండటంతో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేందుకు బెంబేలెత్తిపోయేవారు. వర్షాకాలంలో మోకాలు లోతు బురదనీటిలో రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో వీరి కష్టాలు పూర్తిగా తొలగనున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎన్‌జి.నగరం, కొత్తపెంటతోపాటు వడ్రపాలెం, వేచలం తదితర గ్రామాల ప్రజలకు కొత్తపెంట మీదుగా కె.కోటపాడు మండలానికి చేరుకునేందుకు సులభతరమవుతుంది.

దశాబ్దాల కల నెరవేరుతోంది...



కొత్తపెంట–ఎన్.జి.నగరం గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మించాలని దశాబ్దాలు కోరుతున్నా గత పాలకులు పట్టించుకోలేదు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో తమ చిరకాల కల నెరవేరుతోంది. ఆయన పరిసర గ్రామాల ప్రజలంతా రుణపడి ఉంటాం.

– **రొంగలి వెంకటరావు**, సర్పంచ్, కొత్తపెంట, దేవరాపల్లి మండలం

సునాయాసంగా ప్రయాణం



వంటర్లపాలెం, ముకుందపురం గ్రామాలను అనుసంధానం చేస్తూ కంకర రోడ్డును బీటీరోడ్డుగా మార్పు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ముకుందపురం గ్రామ సచివాలయానికి ప్రయాణం సునాయాసంగా ఉంటోంది. రవాణా సౌకర్యం మెరుగుపడింది.

– **అల్లాడ నాగేశ్వరరావు**, సర్పంచ్, వంటర్లపాలెం, మాడుగుల మండలం

సింగన్నదొరపాలెంలో తొలి రిజిస్ట్రేషన్ ప్రారంభం



రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరావు, సీనియర్ అసిస్టెంట్ శంకర్

కె.కోటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ఆయా సచివాలయంలోనే అందుబాటులోనికి వస్తున్నాయి. దీనిలో భాగంగా కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రీసర్వే పూర్తయిన సింగన్నదొరపాలెం గ్రామ సచివాలయంలో మొదటి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన లగుడు కోటేశ్వరరావు తొలి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనికి సంబంధించిన కంప్యూటరీకరణను డిజిటల్ అసిస్టెంట్ ఆమని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పంచాయతీ కార్యదర్శి కె.ప్రసన్న శైలజ పూర్తి చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శంకర్ పర్యవేక్షించారు. రిజిస్ట్రేషన్ పత్రాలను కోటేశ్వరరావుకు అందించారు. ఇప్పటికే సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్‌పై శిక్షణ ఇచ్చామని ఆయన తెలిపారు. స్థానిక సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ పాలనపై ప్రజా విశ్వాసం

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



కొత్త ఎల్లవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నూరుశాతం నెరవేర్చడం జరుగుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్త ఎల్లవరంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల కాలంలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. తొలుత ఆయన ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కొత్త ఎల్లవరం, మీద ఎల్లవరం గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుండటంతో ప్రజలు తమ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. కొత్త ఎల్లవరం శివారు గ్రామాలు కరక, జిల్లెడిపూడి, రాజుపేట తదితర గిరిజన గ్రామాల్లో పర్యటించారు. కరకలో డ్రైనేజీ, బస్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఆయన వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజుపేటలో ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లెడిపూడి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతపత్రం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపీటీసీ దేముడు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణీ శాంతారామ్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం



స్వామివారి సేవలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

స్వామివారికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు

కె.కోటపాడు: గ్రామాల్లో ప్రజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఐకమత్యంతో నిర్వహించుకోవడం హర్షణీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎ.భీమవరం చెరకు తూనికా కేంద్రం వద్ద అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పూర్తి సహకారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



నర్సయ్యపేటలో మహిళలతో మాట్లాడుతున్న విప్ కరణం ధర్మశ్రీ



కూసర్లపూడిలో సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజల మేలు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సయ్యపేటలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మంజూరుపై ఆరా తీశారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారత ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సబ్సిడీ ఇవ్వడంతో పాటు నేరుగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పండిన పంటను అక్కడే అమ్ముకునే విధంగా అన్ని సౌకర్యాలు తీసుకొచ్చారన్నారు. గ్రామ సర్పంచ్ ఉగ్గిన నాగబాబు స్థానిక సమస్యలను ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు అక్కడికక్కడే మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, మండల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూసర్లపూడిలో...

రొలుగుంట: సంక్షేమ పాలనతో ప్రజలకు మంచి చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూసర్లపూడిలో ఆయన ఇంటింటికీ వెళ్లారు. సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లి సన్యాసినాయుడులతో కలిసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగుళ్ల కాలంలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందించారు. గ్రామ మహిళలు తన దృష్టికి తీసుకొచ్చిన తాగునీటి సమస్య పరిష్కరించాలని, గృహ నిర్మాణాల మంజూరును చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, గొర్లె చెల్లంనాయుడు, ఎంపీటీసీ గొర్లె రామన్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం అభినందించారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు విజయవాడ లయోలా కళాశాలలో ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలుర, బాలికల బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం నింజాస్ అకాడమీ క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. కె.జాహ్నవి(52 కేజీలు), బి.రాజేశ్వరి(54 కేజీలు) విభాగంలో రజత పతకాలు సాధించారు. ఆర్.లిఖిత్(44కేజీలు), ఎస్.శశిధర్ (54 కేజీలు) విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి నర్సీపట్నానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ పి.శ్రీనివాస్, సీనియర్ కోచ్ యర్రా శేఖర్, బాక్సింగ్ కోచ్‌లు సన్యాసిరావు, మాజీ ఆర్మీ బాక్సింగ్ కోచ్, వూషూ కోచ్ వి.ప్రియాంక పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యా కానుక కిట్లు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



మాకవరపాలెంలో విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు



గాదిరాయిలో కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్



అనంతపద్మనాభపురం పాఠశాలలో కిట్లు అందిజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో పార్థసారథి

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో మంగళవారం వారు విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంఈవో టి.మధుమూర్తి, హెచ్ఎంలు ఈర్లి అప్పారావు, సూర్యనారాయణ మూర్తి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఎంపీపీ కురచా జయమ్మ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పుస్తకాలు కొనలేక తల్లిదండ్రులు పాఠశాలలు మాన్పించేవారని వాపోయారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా లేదన్నారు. జెడ్పీటీసీ లాలం శారదాజానకీరామ్, పాఠశాల కమిటీ చైర్మన్, కురచా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 54 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,590 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్టు ఎంఈవో నరేష్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు హరిబాబు, భద్రాచలం, గోవిందరావు, చిటికెల రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల: గాదిరాయి హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను వైస్ ఎంపీపీ రాజారామ్ పంపిణీ చేశారు. ఇక్కడ మూడు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు వీటికి అందజేశారు. సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పల్రే రామునాయుడు, నాయకులు పల్రే రమణ, సలాది అచ్చింనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందించే బాధ్యత హెచ్ఎంలదే అని ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి తెలిపారు. అనంత పద్మనాభపురం, నాతవరం పంచాయతీలోని పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసి వారితో మాట్లాడారు. మండలంలో 4,698 మందికి కిట్లు వచ్చాయన్నారు. సీఆర్పీల పర్యవేక్షణలో పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి జె.చినబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్‌కు 9 మంది విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

నాతవరం: చమ్మచింత పాఠశాలకు చెందిన తొమ్మిది విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారని హెచ్ఎం కాశపు సత్యనారాయణ తెలిపారు. స్థానిక పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఆయనతోపాటు కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరానికి సంబంధించి నర్సీపట్నం రెసిడెన్షియల్‌కు ముగ్గురు, గొలుగొండలో స్కూల్‌కు ముగ్గురు, చోడవరం బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఇద్దరు, అనకాపల్లి స్కూల్‌కు ఒకరు చొప్పున ఎంపికయ్యారని తెలిపారు.